بِسۡمِ اللّٰہِ الرَّحۡمٰنِ الرَّحِیۡمِ     نَحۡمَدُہٗ وَنُصَلِّیۡ عَلٰی رَسُوۡلِہِ الۡکَرِیۡمِ     وَعَلٰی عَبۡدِہِ الۡمَسِیۡحِ الۡمَوۡعُوۡدِ

Summary of Friday Sermon Hazrat Khalifatul Masih V, 15 Aug 2025 (Telugu)

# మక్కా విజయ యుద్ధం తర్వాత కొన్ని సరాయాల నేపథ్యంలో హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం జీవిత చరిత్ర ప్రస్తావన

**హజ్రత్ అమీరుల్ మూమినీన్ ఖలీఫతుల్ మసీహిల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ 15.08.2025 తేదీన – హదీఖతుల్ మహ్దీ, (వార్షిక బహిరంగల సభల ప్రాంగణం) ఇంగ్లాండ్‌లో ప్రసంగించిన ఖుత్బా జుమా సారాంశం**

أَشْهَدُ أَنْ لَّا إِلٰهَ إِلَّا اللّٰهُ وَحْدَهٗ لَا شَرِيْكَ لَهٗ وَأَشْهَدُ أَنَّ مُحَمَّدًا عَبْدُهٗ وَرَسُوْلُهٗ ـ أَمَّا بَعْدُ فَأَعُوْذُ بِاللّٰهِ مِنَ الشَّيْطٰنِ الرَّجِيْمِ ـ
بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ ○ اَلْحَمْدُ لِلّٰهِ رَبِّ الْعٰلَمِيْنَ ○ الرَّحْمٰنِ الرَّحِيْمِ ○ مٰلِكِ يَوْمِ الدِّيْنِ ○ إِيَّاكَ نَعْبُدُ وَإِيَّاكَ نَسْتَعِيْنُ ○ اِهْدِنَا الصِّرَاطَ الْمُسْتَقِيْمَ ○ صِرَاطَ الَّذِيْنَ اَنْعَمْتَ عَلَيْهِمْ غَيْرِ الْمَغْضُوْبِ عَلَيْهِمْ وَلَا الضَّآلِّيْنَ ○

తషహ్హుద్, తఅవ్వుజ్, ఫాతిహా అధ్యాయం పఠించిన అనంతరం హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ ఇట్లు ఉపదేశించారు.

గత శుక్రవారం నేను మూడు పెద్ద విగ్రహాలను కూల్చివేసిన గురించి చెప్పాను. దాని గురించి మరిన్ని వివరాలు ఈ విధంగా ఉన్నాయి. ఒక సరయ్య (సైనిక దళం) హజ్రత్ సాద్ బిన్ జైద్ అష్అలీ (రజి)కు సంబంధించినది ఉండెను. ఇది హిజ్రీ ఎనిమిదవ సం॥ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం రంజాన్ 24వ తేదీన మనాత్ విగ్రహాన్ని ధ్వంసం చేయడానికి పంపారు. ఈ విగ్రహం ఎర్ర సముద్రపు తీరంలో, ఖదీద్ దగ్గర ముషల్లల్ అనే ప్రదేశంలో ప్రతిష్ఠించబడెను. అందుకే దీనిని 'సరయ్యా ముషల్లల్' అని కూడా అంటారు. హజ్రత్ సాద్ బిన్ జైద్ అష్అలీ (రజి) అక్కడకు చేరుకున్నప్పుడు, అక్కడ ఒక పూజారి కూడా ఉండెను. ఆ పూజారి హజ్రత్ సాద్‌తో, "మీకు ఏమి కావాలి?" అని అడిగాడు. దానికి వారు, "మనాత్ విగ్రహాన్ని కూల్చివేయాలి" అని చెప్పారు. ఆ పూజారి, "మీరు, ఈ పని చేయడమా? ఇది అసాధ్యం, మీ వల్ల కాదు" అని అన్నాడు. హజ్రత్ సాద్ ఆ విగ్రహం వైపునకు ముందుకు వెళ్ళారు. దీనికి సంబంధించిన కథనం ప్రకారం, ఇది నిజమా కాదా అనేది తెలియదు కానీ, కొన్నిసార్లు కథకు రంగులు అద్దడానికి చెప్తుంటారు, అప్పుడు ఒక నల్లని, చిందరవందర కేశాలు గల, నడుము పై నుండి బట్టలు లేని స్త్రీ గది నుండి బయటికి వచ్చింది. ఆ పూజారి తన విగ్రహంతో "ఓ మనాత్, నీ కోపాన్ని ప్రదర్శింపు" అని అన్నాడు. హజ్రత్ సాద్ బిన్ అష్అలీ ఆ పూజారిని చంపారని చెబుతున్నారు. హుజూరె అన్వర్ దీనిని విశ్లేషిస్తూ ఇట్లనిరి. ఈ హత్య కథనం నిజమైతే, బహుశా ఆ పూజారి ప్రతిఘటించడానికి ప్రయత్నించి, పోరాటంలో మరణించి ఉండవచ్చు. కేవలం శాపాలు పెట్టినందుకు చంపడం ఇస్లామి బోధన కాదు. అది సరైనదిగా కూడా అనిపించదు. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం సాధారణ ఆదేశాలకు కూడా ఇది విరుద్ధం.

హజ్రత్ ఖాలిద్ బిన్ వలీద్ (రజి) నాయకత్వంలో నఖ్లాకు ఒక దళం రంజాన్ నెల 25వ రోజున, హిజ్రీ 8వ సం॥ అనగా జనవరి 629వ సం॥లో నఖ్లాలో ఖురైషీల ప్రసిద్ధ విగ్రహం 'ఉజ్జా'ను కూల్చివేయడానికి ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం పంపారు. ఇబ్నె ఇస్హాఖ్ (రహ్మ) ప్రకారం ఉజ్జా విగ్రహ పూజారికి హజ్రత్ ఖాలిద్ (రజి) రాక గురించి తెలిసినప్పుడు అతను ఆ

విగ్రహంపై కత్తిని వేలాడదీసి తాను స్వయంగా కొండపైకి ఎక్కి కొన్ని పద్యాలు చదవసాగెను. “ఓ ఉజ్జా! ఖాలిద్‌పై తీవ్రంగా దాడి చెయ్యి, ఏమీ మిగలకుండా చెయ్యి. యుద్ధ ముసుగు ధరించి, చేతులు పైకి మడుచుకో. ఓ ఉజ్జా! ఒకవేళ నువ్వు ఈ ఖాలిద్‌ను చంపలేకపోతే అతడిని వెంటనే పాపానికి పాత్రుడిని చెయ్యి లేదా అతడిపై ప్రతీకారం తీర్చుకో.” హజ్రత్ ఖాలిద్ నఖ్లాకు చేరుకోగానే ఆ తుమ్మ చెట్లను నరికి ఉజ్జా విగ్రహం ఉన్న ఇంటిని కూల్చివేశారు. తరువాత మక్కాకు తిరిగి వచ్చి దైవ ప్రవక్త స.అ.స. గారికి నివేదిక సమర్పించారు. అప్పుడు ఆయన సల్లల్లాహు అలైహి వసల్లం “నువ్వు అక్కడ ఏమైనా ప్రత్యేకంగా చూశావా?” అని అడిగారు. హజ్రత్ ఖాలిద్ (రజి) లేదని జవాబిచ్చారు. అప్పుడు మహా ప్రవక్త స.అ.స. “అయితే నువ్వు ఉజ్జాను పూర్తిగా నాశనం చేయలేదు. వెనక్కి వెళ్లి దానిని పూర్తిగా అంతం చేసిరా” అని ఆదేశించారు. ఈ ఆదేశం వినగానే, హజ్రత్ ఖాలిద్ వెంటనే ఆజ్ఞను పాటించడానికి వెనక్కి వెళ్ళారు. పర్యవేక్షకులు హజ్రత్ ఖాలిద్ (రజి)ను మళ్ళీ చూసినప్పుడు, వారు కొండపైకి ఎక్కారు. వారు “ఓ ఉజ్జా! వారిని నాశనం చెయ్యి” అని అరుస్తుండిరి. ఆ గుడి నుండి చిందరవందరగా ఉన్న జుట్టుతో నల్లని స్త్రీ బయటికి వచ్చింది. అప్పుడు హజ్రత్ ఖాలిద్ (రజి) ఇట్లు పద్యం చదువుతుండిరి. “అయ్యో, ఓ ఉజ్జా! నేను నిన్ను తిరస్కరిస్తున్నాను. నేను నీ పవిత్రతను వర్ణించను. దేవుడు నిన్ను అగౌరవపరచడాన్ని నేను చూశాను.” ఆ తరువాత ఖాలిద్ (రజి) మహా ప్రవక్త స.అ.స. వద్దకు తిరిగి వచ్చి దీని వివరాలను సమర్పించారు. అప్పుడు దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం “అవును, అది ఉజ్జా. ఇప్పుడు అది మీ నగరాల్లో ఎన్నటికీ పూజింపబడదు, అది నిరాశ చెందిందని” అన్నారు.

ఆ తరువాత, అమ్ర్ బిన్ ఆస్ (రజి) నాయకత్వంలో ‘సువా’ విగ్రహం కూల్చివేతకు మరొక దళం పంపబడిన ప్రస్తావన గలదు. ఇది కూడా రంజాన్, హిజ్రీ 8వ సం॥లో జరిగింది. ఉజ్జా విగ్రహం కూల్చివేత అనంతరమే మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం అమ్ర్ బిన్ ఆస్‌ను ‘సువా’ విగ్రహాన్ని ధ్వంసం చేయడానికి పంపారు. ఈ విగ్రహం ఒక స్త్రీ రూపంలో ఉండేది. పవిత్ర ఖుర్‌ఆన్‌లో కొన్ని విగ్రహాల పేర్లు ప్రస్తావించబడ్డాయి. వాటిలో ఈ విగ్రహ ప్రస్తావన కూడా ఉంది. నూహ్ అధ్యాయంలో ఇట్లు గలదు. మరియు వారు ఒకరితోనొకరు ఇలా అనుకున్నారు: మీరు మీ ఆరాధ్య దైవాలను విడిచి పెట్టకండి. వద్, సువా, యఘూస్, యఊఖ్, నస్ర్ లను విడిచి పెట్టకండి. నిజానికి, ఈ విగ్రహాల పేర్లన్నీ నూహ్ ప్రవక్త జాతిలోని కొందరు మంచి వ్యక్తుల పేర్లే. వారు చనిపోయిన తరువాత, షైతాన్ ఆ ప్రజల మనసుల్లో, “వారు కూర్చునే చోట వారి పేర్లతో విగ్రహాలను నిలబెట్టండి” అని ప్రేరేపించాడు. వారు అలానే చేశారు. అనంతరం ఆ విగ్రహాలను పూజించడం మొదలుపెట్టారు.

హజ్రత్ అమ్ర్ బిన్ ఆస్ (రజి) రుహత్ అనే ప్రదేశంలో ‘సువా’ విగ్రహం వద్దకు చేరుకున్నప్పుడు, అక్కడ వారికి ఆ విగ్రహ పూజారి తారసపడ్డాడు. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఆజ్ఞతో ఆ విగ్రహాన్ని పగలగొట్టడానికి వచ్చానని వారు (రజి) చెప్పారు. అందుకు ఆ పూజారి “నువ్వు దానిని పగలగొట్టలేవు” అని జవాబిచ్చాడు. అప్పుడు అమ్ర్ బిన్ ఆస్ (రజి) కారణం అడగగా “నువ్వు కచ్చితంగా అడ్డుకోబడతావు” అని చెప్పాడు. అప్పుడు అమ్ర్ బిన్ ఆస్ (రజి) “నీ మీద నాకు జాలి వేస్తోంది! ఇది వినగలదా? చూడగలదా?” అని అన్నారు. తరువాత ముందుకు వెళ్లి ఆ విగ్రహాన్ని పగలగొట్టారు. తమతో ఉన్నవారితో, “దాని పక్కన ఉన్న గదిని కూడా నేలమట్టం చెయ్యండి” అని చెప్పారు. వారు

దానిని కూడా ధ్వంసం చేశారు. అప్పుడు అమ్ర్ బిన్ ఆస్ (రజి) ఆ పూజారితో, "ఇప్పుడు చెప్పు" అని అడిగారు. తన దేవుడి ఈ పరిస్థితి చూసిన ఆ పూజారి వెంటనే "నేను దేవుని ఆజ్ఞను పాటిస్తాను, ఇస్లాంను స్వీకరిస్తాను" అని అన్నాడు. హుజూరె అన్వర్ ఇట్లు విశ్లేషించిరి. ఈ సంఘటనను బట్టి, పూజారిని లేదా మరెవరినైనా చంపే కథనం నిజంగా సందేహాస్పదమైనదని ధృవీకరించబడుతోంది.

ఖాలిద్ బిన్ వలీద్ (రజి) నాయకత్వంలో బనూ జజీమా తెగ వైపు ఒక సైనిక దళం షవ్వాల్ నెల, హిజ్రీ 8వ సం॥లో జరిగింది. మక్కా విజయం తరువాత, ఖాలిద్ బిన్ వలీద్ (రజి) ఉజ్జా విగ్రహాన్ని కూల్చివేసి తిరిగి వచ్చాక, దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం వారిని బనూ జజీమా తెగ వైపు పంపారు. ఈ తెగ మక్కాలోని యలమ్లంకు సమీపంలో నివసించేది. మహా ప్రవక్త స.అ.స. ఖాలిద్ బిన్ వలీద్‌తో, ఈ తెగను ఇస్లాం వైపు ఆహ్వానించమని, వారితో యుద్ధం చేయవద్దని చెప్పారు.

ఇబ్న్ సాద్ వివరణ ప్రకారం, ఖాలిద్ (రజి) వారి వద్దకు వచ్చి, "మీరు ఏ మతంలో ఉన్నారు?" అని అడిగారు. దానికి వారు, "మేము ముస్లింలం" అని జవాబిచ్చారు. అప్పుడు ఖాలిద్, "అయితే మీరు ఎందుకు ఆయుధాలు పట్టుకున్నారు?" అని అడిగాడు. వారు, "మాకు, అరబ్బుల్లోని మరొక తెగకు మధ్య శత్రుత్వం కొనసాగుతుంది. అదే శత్రువు అని మేము అనుమానించాము, అందుకే ఆయుధాలు తీసుకున్నాము" అని చెప్పారు. కథనాల ప్రకారం ఈ వివరణతో ఖాలిద్ (రజి) సంతృప్తి చెందలేదని తెలుస్తోంది. అందుకే వారు (రజి) రాత్రి చివరి భాగంలో బందీలను చంపడానికి ధార్మిక ఆదేశం ఇచ్చారు. దీనితో కొంతమంది ముస్లింలు తమ బందీలను చంపారు. కానీ వలస వచ్చిన ముస్లింలు, అన్సార్ ముస్లింల బృందం ఖాలిద్ (రజి) నిర్ణయంతో ఏకీభవించకుండా తమ బందీలను చంపలేదు. ఈ సంఘటన గురించి దైవ ప్రవక్త స.అ.స.కు తెలిసినప్పుడు చాలా బాధపడ్డారు. "నేను ఖాలిద్‌ను వారిని చంపమని ఆదేశించలేదు. నేను వారిని ఇస్లాం వైపు ఆహ్వానించమని మాత్రమే చెప్పాను" అని వారన్నారు. తరువాత ఆయన (స.అ.స.) తన రెండు చేతులను పైకెత్తి దేవుడితో రెండుసార్లు ఈ విధంగా వేడుకున్నారు. "ఓ అల్లాహ్, ఖాలిద్ చేసిన దానికి నేను నీ వద్ద విముఖత వ్యక్తం చేస్తున్నాను."

ఆ తరువాత ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం హజ్రత్ అలీ (రజి) కు అక్కడ చనిపోయిన వారికి నష్టపరిహారం చెల్లించుటకు, మొత్తం వ్యవహారాన్ని పరిశీలించుటకు పంపారు. హజ్రత్ అలీ అక్కడికి వెళ్లి, హతుల వారసులకు పూర్తి నష్టపరిహారం చెల్లించారు. ముస్లింలు తీసుకున్న ఆస్తులన్నీ వారికి తిరిగి ఇచ్చారు. కుక్క నీరు తాగే చెక్క పాత్రను కూడా వెనక్కి తిరిగి ఇచ్చారు. అందరికీ పరిహారం చెల్లించిన తర్వాత కూడా హజ్రత్ అలీ (రజి) వద్ద మిగిలిన డబ్బును కూడా వారికే ఇచ్చి "ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం తరపున నేను ఈ డబ్బును ముందు జాగ్రత్తగా ఇస్తున్నాను, మీకు, అల్లాహ్ దూతకు తెలియని ఏ నష్టమైనా ఉంటే అది కూడా భర్తీ అవుతుంది" అని చెప్పారు. ఫలితంగా ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం చాలా సంతోషించి హజ్రత్ అలీతో "నువ్వు చాలా మంచి పని చేశావు, చాలా సరిగ్గా చేశావు" అని అన్నారు. ఈ సంఘటనకు ముందు ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ఒక స్వప్నం కూడా ఇట్లు చూశారు. "నేను ఒక స్వప్నంలో హైస్ (ఖర్జూరాలు, పనీర్, నెయ్యితో కలిపిన ఒక ఆహారం)లోని ఒక ముద్ద తీసుకు న్నప్పుడు దాని రుచి నాకు మంచిగా అనిపించిది. దానిని నేను మింగినప్పుడు దాని కొంత

భాగం నా గొంతులో ఇరుక్కుపోయింది. అప్పుడు అలీ (రజి) తన చెయ్యి పెట్టి దానిని బయటికి తీశాడు.” హజ్రత్ అబూబకర్ (రజి) ఈ కలకు అర్థం చెబుతూ “ఓ అల్లాహ్ దూత! మీరు పంపే సైనిక దళాలలో ఇదొకటి. అందులో కొన్ని విషయాలు మీకు నచ్చుతాయి, కొన్ని అభ్యంతరకరంగా ఉంటాయి. అప్పుడు మీరు అలీని పంపుతారు. అతను ఆ విషయాన్ని పరిష్కరించి, సరిచేస్తారు.” ఈ సైనిక దళం సంఘటనతో ఆ స్వప్నం నిజమైంది.

హజ్రత్ సయ్యద్ జైనుల్ ఆబిదీన్ వలియుల్లాహ్ షాహ్ గారు కూడా బుఖారి విశ్లేషణ వ్రాశారు. ఈ మొత్తం సంఘటనలను, కథనాలను విశ్లేషిస్తూ ఒక గొప్ప విజ్ఞానపూరితమైన వ్యాసం వ్రాశారు. దానితో ఇట్లు స్పష్టమగుతుంది. ఇందులో ఖాలిద్ బిన్ వలీద్ (రజి) నకు ఎలాంటి దురుద్దేశం లేకుండెను. ఒక అసంకల్పిత పొరపాటు జరిగింది. ఈ కారణంగానే మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఖాలిద్ పట్ల ఆగ్రహం వ్యక్తం చేసి, దేవుని వద్ద తమ విముఖతను తెలిపారు. దీనిని పరిశీలించినప్పుడు, ఈ హత్యలు ఒక అపార్థం వల్ల జరిగాయని రుజువైంది. అందుకే దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ప్రతీకారానికి బదులుగా నష్టపరిహారం చెల్లించాలని నిర్ణయించారు. ఖాలిద్ బిన్ వలీద్ (రజి) తన వివరణను, క్షమాపణను సమర్పించిన తరువాత మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం వారిని క్షమించారు. కేవలం వారిని క్షమించడమే కాకుండా, కొన్ని రోజుల తర్వాత హునైన్ యుద్ధం కోసం ఏర్పాటు చేసిన సైన్యపు అగ్రభాగంతో పాటు అశ్వ దళానికి అధిపతిగా నియమించారు.

దీనితో పాటు మరో రెండు సరాయాల సంక్షిప్త ప్రస్తావన కూడా లభిస్తుంది. యలమ్లం సరయ్య గలదు. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం హాషీమ్ బిన్ ఆస్ రజియల్లాహు అన్హు నాయకత్వంలో 200 మందితో ఈ దళాన్ని మక్కాకు ఆగ్నేయంలో ఉన్న యలమ్లం వైపు పంపారు.

సరయ్యా ఉర్నా గలదు. ఇది అరాఫాత్‌కు ఎదురుగా ఉన్న లోయ. ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ఖాలిద్ బిన్ సయీద్ బిన్ ఆస్ (రజి) ను 300 మంది సైన్యానికి నాయకుడిగా చేసి ఆ వైపు పంపారు. ఈ సైనిక దళాల గురించి ముహమ్మద్ బిన్ ఉమర్ వాఖిదీ మాత్రమే పేర్కొన్నారు. ఆయన కాకుండా ఇతర ప్రముఖ చరిత్రకారులు ఎవరూ దీని గురించి రాయలేదు. అందుకే ఈ కథనాలు నిజమా కాదా అనేది సందేహాస్పదం. దీని గురించి మరిన్ని వివరాలు అందుబాటులో లేవు.

ముగింపులో హుజూరె అన్వర్ ఇట్లనిరి. మొత్తమ్మీద దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం గారి ఈ చరిత్ర ద్వారా ఒక విషయం స్పష్టంగా అర్థమవుతుంది. వారెప్పుడూ కఠినంగా వ్యవహరించలేదు. యుద్ధాలలో వారు స.అ.స. హత్యలు చేయించారని ఇస్లాం శత్రువులు చేసే ఆరోపణలు కూడా తప్పే. చిన్న పొరపాటు జరిగినా వారు సల్లల్లాహు అలైహి వసల్లం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

اَلْحَمْدُ لِلّٰهِ نَحْمَدُهٗ وَنَسْتَعِيْنُهٗ وَنَسْتَغْفِرُهٗ وَنُؤْمِنُ بِهٖ وَنَتَوَكَّلُ عَلَيْهِ۔ وَنَعُوْذُ بِاللّٰهِ مِنْ شُرُوْرِ اَنْفُسِنَا وَمِنْ سَيِّئَاتِ اَعْمَالِنَا۔ مَنْ يَّهْدِهِ اللّٰهُ فَلَا مُضِلَّ لَهٗ وَمَنْ يُّضْلِلْهُ فَلَا هَادِيَ لَهٗ۔ وَنَشْهَدُ اَنْ لَّآ اِلٰهَ اِلَّا اللّٰهُ وَنَشْهَدُ اَنَّ مُحَمَّدًا عَبْدُهٗ وَرَسُوْلُهٗ۔ عِبَادَ اللّٰهِ رَحِمَكُمُ اللّٰهُ! اِنَّ اللّٰهَ يَاْمُرُ بِالْعَدْلِ وَالْاِحْسَانِ وَاِيْتَآءِ ذِي الْقُرْبٰى وَيَنْهٰى عَنِ الْفَحْشَآءِ وَالْمُنْكَرِ وَالْبَغْيِ۔ يَعِظُكُمْ لَعَلَّكُمْ تَذَكَّرُوْنَ۔ اُذْكُرُوا اللّٰهَ يَذْكُرْكُمْ وَادْعُوْهُ يَسْتَجِبْ لَكُمْ وَلَذِكْرُ اللّٰهِ اَكْبَرُ۔